సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 22 । జనవరి । 2023



అంజన్న సన్నిధిలో రద్దీ

కొండగట్టు:అంజన్న సన్నిధిలో శనివారం రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



మైనార్టీ గురుకులం..

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశానికి ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0/17.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బాలికా విద్యకు ఎన్టీపీసీ ప్రోత్సాహం



ప్రశంసాపత్రం అందిస్తున్న ఈడీ

జ్యోతినగర్(రామగుండం): బాలికా విద్యకు ఎన్టీపీసీసంస్థ ప్రోత్సాహం అందిస్తుందని రామగుండం– తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కాకతీయ ఆడిటోరియంలో బాలికా సాధికారత మిషన్–2022 ఫాలోఆప్ ముగింపు శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు అత్యుత్తమ శిక్షణ అందించేందుకు ప్రత్యేక శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్‌సైన్స్, మహిళల సాధికారతపై నృత్య ప్రదర్శనలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇటుకబట్టీల్లో తనిఖీలు



ఇటుకబట్టీల్లో అధికారుల తనిఖీలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రంగాపూర్, రాఘవాపూర్ ప్రాంతాల్లోని ఇటుకబట్టీల్లో కాలుష్యనియంత్రణ మండలి అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రంగాపూర్ గ్రామానికి చెందిన బాలసాని వెంకటేశం తదితరులు ఇటుకబట్టీల నిర్వహణతో తమ పంట పొలాలు దెబ్బతింటున్నాయని లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. తాటి, ఈత వనం నుంచి కల్లు దిగుబడి రాక గీతవృత్తి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారంటూ కొయ్యడ సారయ్యగౌడ్ పేర్కొన్నాడు. ఈ మేరకు కాలుష్యనియంత్రణ మండలి అధికారులు వీడియో, ఫొటో చిత్రీకరణ చేస్తూ బట్టీలను పరిశీలించారు. వీటిని లోకాయుక్తకు సమర్పిస్తామని కాలుష్యనియంత్రణ మండలి అధికారి భిక్షపతి వివరించారు.

తల్లిదండ్రులు మమేకం కావాలి



సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు

గోదావరిఖనిటౌన్: తల్లిదండ్రులు పాఠశాలతో మమేకమైనప్పుడే పిల్లల విద్యాభివృద్ధి బాగుంటుందని సమగ్ర శిక్ష రాష్ట్ర సంచాలకుడు పి.రాజీవ్ అన్నారు. గోదావరిఖని పట్టణంలోని గాంధీపార్క్ ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులు తరచుగా పాఠశాలను సందర్శించి విద్యార్థుల చదువులో పురోగతిని తెలుసుకోవాలన్నారు. అనంతరం తల్లిదండ్రులకు ఆటలపోటీలు నిర్వహించారు. శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీ చేశారు. జిల్లా విద్యా సెక్టోరియల్ అధికారులు విజయ్‌కుమార్, శ్రీనివాస్, ఎంఈవో లక్ష్మి, హెచ్‌ఎం ఇజ్రాయిల్, చెరుకూరి స్వరూప పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ఎరువులు విక్రయించాలి



రైతులకు సూచన ఇస్తున్న ఆదిరెడ్డి

సుల్తానాబాద్ రూరల్/పాలకుర్తి: ఎరువుల దుకాణదారులు నిబంధనలకు లోబడి ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి పేర్కొన్నారు. శనివారం సుల్తానాబాద్ మండలం చిన్నకల్వలలో డివిజన్‌స్థాయి డీలర్ల సమావేశం నిర్వహించారు. నిబంధలను అతిక్రమించి ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. లైసెన్సు నూతన విధానాలపై డీలర్లకు అవగాహన కల్పించారు. ఏడీఏ శ్రీనాథ్, ఏవోలు పాల్గొన్నారు. అదే విధంగా పాలకుర్తి మండలం కుక్కల గూడూరు శివారులోని పంటపొలాలను ఆదిరెడ్డి పరిశీలించారు. వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఈవోలు శశిధర్, సుష్మ ఉన్నారు.

నల్లనేలలో 'నవ'తరం

సింగరేణిలో పెరుగుతున్న యువత

Sunday Special

గోదావరిఖని(రామగుండం): సిరులవేణి.. మన సింగరేణిలో నవశకం నడుస్తోంది. బొగ్గుగనులపై యువరక్తం ఉరకలేస్తోంది. సింగరేణి ఆవిర్భావం నుంచి తట్టా, చెమ్మాస్ చేతపట్టి బొగ్గుపెల్లలు మోసిన కార్మికులు ఆ బాధ్యతను వారసత్వంగా అందిస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత కారుణ్య నియామకాల ద్వారా వేలాది మంది కార్మికులు తమ పిల్లలకు సింగరేణి సంస్థ అభివృద్ధిలో అవకాశం కల్పిస్తున్నారు. డిగ్రీలు, పీజీలు, ఇంజనీరింగ్ చదివిన వాళ్లు సైతం కార్పొరేట్ ఆఫీసుల్లో ఉద్యోగం వదులుకుని గనుల్లోకి దిగుతున్నారు. పురుషులతో సమానంగా యువతులు కూడా సింగరేణి తల్లి ఒడిలో కొలువు చేస్తున్నారు. రామగుండం రీజియన్ పరిధిలో 4వేల మంది వరకు యువత ఉద్యోగం చేస్తుండగా.. సింగరేణి వ్యాప్తంగా 12 వేల మంది కార్మికులు ఉన్నారు. సింగరేణి సంస్థలో యువత పాత్రపై సండే స్పెషల్..!!



ఇతని పేరు ఆకుల చందు. హుజూరాబాద్ నివాసి. చందు మామ మెడికల్ ఇన్వాలిడేషన్ కావడంతో అల్లుడిగా సింగరేణిలో ఉద్యోగం లభించింది. మూడేళ్లుగా ఆక్టింగ్ సపోర్ట్‌మెన్‌గా డ్యూటీ చేస్తున్నాడు. 'గనిలోకి వెళ్లి విధులు నిర్వహించడం కొత్త అయినప్పటికీ.. ఇన్ని రోజులు పనిచేసిన అనుభవం, సీనియర్ల సూచనలు సలహాలతో ఉత్సాహంగా ముందుకు సాగుతున్నా' అంటూ చందు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



ఈమె పల్లికొండ శిరీష. రామగుండం పరిధిలోని లింగాపూర్ గ్రామం. తండ్రి మెడికల్ ఇన్‌వాలిడేషన్ కావడంతో అతడి ఉద్యోగం కారుణ్య నియామకం ద్వారా శిరీషకు వచ్చింది. శిరీష అన్నకు ఉద్యోగం ఉంది. తమ్ముడు చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో నాన్న తనకు సంస్థలో ఉద్యోగం పెట్టించాడని.. మిషన్ వైండింగ్‌సెక్షన్‌లో పనిచేస్తున్నట్లు శిరీష వివరించింది.





- కారుణ్య నియామకాలతో సంస్థకు కొత్తరక్తం
- భారీగా పెరిగిన యువ, మహిళా కార్మికులు
- ఇప్పటికే 12వేల మార్కు దాటిన యువ ఉద్యోగులు

కారుణ్య నియామకంతో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న సింగరేణి సంస్థ రాష్ట్రంలోని గోదావరి పరీవాహకంలో ఏడు జిల్లాల్లో విస్తరించి ఉంది. తెలంగాణ ప్రాంతానికి కొంగుబంగారంగా నిలుస్తున్న సంస్థలో యువ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ఆవిర్భావం తరువాత కారుణ్య నియామక ప్రక్రియ చేపట్టినప్పటికీ.. కొందరు కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయింది. దీనిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసిన రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చూసింది. అనారోగ్యం బారినపడిన కార్మికులను మెడికల్ ఇన్‌వాలిడేషన్ ద్వారా ఉద్యోగ విరమణకు అవకాశం కల్పిస్తూ కారుణ్య నియామకాల ద్వారా వారి పిల్లలకు అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో 2018 మార్చి9 నుంచి కారుణ్య నియామక ప్రక్రియ ప్రారంభమైంది. రెండేళ్ల సర్వీసున్న వారు అనారోగ్య కారణాలతో దిగిపోతే.. వారి పిల్లలకు అవకాశం కల్పిస్తున్నారు. ఇలా సంస్థవ్యాప్తంగా ఇప్పటి వరకు 12 వేల మందికిపైగా యువ కార్మికులు నియామకం అయ్యారు.

ఉన్నతంగా చదివి

సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇతర రంగాల్లో పనిచేస్తున్న యువత సైతం కారుణ్య నియామకాల ద్వారా సింగరేణిలో పనిచేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత, నివాసం, కనీస వసతులు, మెరుగైన జీతం ఉండడంతో పోటీపడుతున్నారు. ప్రస్తుతం గనుల్లోకి దిగే యువ కార్మికుల్లో డిగ్రీ, పీజీలు, ఇంజినీరింగ్ చేసినవారు ఉన్నారు. కారుణ్య నియామకాల్లో కొడుకులు లేనివారు కూతుళ్లకు అవకాశం ఇస్తున్నారు. కూతుళ్లకు సాధ్యం కాని పరిస్థితుల్లో అల్లుళ్లకు బాధ్యత అప్పగిస్తున్నారు.

మహిళా కార్మికులు

సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మహిళా ఉద్యోగులకు అవకాశం కల్పిస్తూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకోవడంతో సంస్థలో వారి సంఖ్య పెరుగుతోంది. ఇద్దరు ఆడపిల్లలు, ఒక్కరే కూతురున్న కార్మికులు ధైర్యంగా వారి సింగరేణి ఉద్యోగాలను అప్పగిస్తున్నారు. కారుణ్య నియామకాల పక్రియ వేగవంతం కావడంతో సంస్థలో వయస్సుపైబడిన ఉద్యోగులు సంస్థకు దూరమవుతుండగా, వారి స్థానంలో యువ ఉద్యోగులు సంస్థలో చేరుతున్నారు. దీంతో సంస్థలో యువరక్తం పెరిగింది.



సింగరేణిలో కారుణ్య నియామకాలు(ఫైల్)



సింగరేణి సంస్థలో పనిచేస్తున్న మహిళా కార్మికులు

గిరిజన యువతకు అవకాశం

సింగరేణి ప్రభావిత, నిర్వాసిత ప్రాంతాలకు చెందిన గిరిజన యువకు యాజమాన్యం అవకాశం కల్పించింది. ఒకేదఫాగా వెయ్యి మందికి పైగా నియామకం అయ్యారు. ఎస్టీ బ్యాక్‌లాక్ కింద 665మంది, పీడీఎఫ్ కింద 350మందికి ఉద్యోగాలను కల్పిస్తూ సంస్థ నిర్ణయం తీసుకోవడంతో కొలువుకెక్కారు. అదే విధంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 3,600 మందిని ఎంపిక చేశారు. వీరిలో డాక్టర్లు, మెడికోలు, ఇంజనీర్లు, తదితర విభాగాల్లో పనిచేసేవారు ఉన్నారు.

రామగుండం రీజియన్‌లో యువ ఉద్యోగులు ఇలా..

ఏరియా	పురుషులు	మహిళలు	మొత్తం
ఆర్జీ–1	1,226	68	1,294
ఆర్జీ–2	648	60	708
ఆర్జీ–3,ఏపీఏ	797	43	840

జీవితాన్ని మార్చేసింది



నాన్న మెడికల్ ఇన్‌వాలిడేషన్‌తో వకీల్‌పల్లిగనిలో ఉద్యోగం లభించింది. ఆక్టింగ్ సపోర్ట్‌మెన్, ఆక్టింగ్ కోల్‌కటింగ్ పనులకు వెళ్తున్నా. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన. తప్పనిసరి పరిస్థితుల్లో సింగరేణిలో చేరా. ఉద్యోగ భద్రత, విద్య, వైద్యం, మెరుగైన జీతాలుండటంతో ఇటువైపు దృష్టి సారించా. రాబోయే రోజుల్లో మరింత కష్టపడి పదోన్నతి సాధించాలని ఉంది. – మంచాల కల్యాణ్‌కుమార్, మెన్నంపల్లి, కూనారం

ప్రయివేట్ నుంచి సింగరేణికి



నాన్న ఉద్యోగం నాకు ఇచ్చారు. గతంలో ప్రయివేట్ ఉద్యోగం చేసేదాన్ని. డిగ్రీ చదివిన నాకు ఏరియా వర్క్‌షాప్‌లో పోస్టింగ్‌ఇచ్చారు. ఉద్యోగంలోకి చేరి పదినెలలు అయ్యింది. చాలా సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో క్లర్క్‌గా పదోన్నతి సాధించాలని ఉంది. ప్రస్తుతం వర్క్‌షాప్‌లో ఫ్యాన్ రిపేరింగ్‌సెక్షన్‌లో పనిచేస్తున్నా. – ఈర్ల కల్పన, గోదావరిఖని

భర్త ఉద్యోగం చేస్తున్న



వృత్తిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్సాహంగా పనిచేస్తున్నాం. భర్త ఉద్యోగాన్ని చేస్తున్నా. ఏరియా వర్క్‌షాప్‌లో స్టార్టర్ వైండింగ్ విభాగంలో జాబ్ చేస్తున్నా. మహిళలతో పాటు పనిచేయడంతో పాటు టైం తెలవకుండా ముందుకు సాగుతున్నాం.

– కంటి సంధ్యారాణి, గంగానగర్

దళితరైతులకు 'ఎడ్లబండి'

- పీఎం అజయ్ పథకం కింద కేటాయింపు
- పైలట్ ప్రాజెక్టుగా ధర్మపురి నియోజకవర్గం
- జిల్లాలో ధర్మారం మండలానికి 50 యూనిట్లు

పెద్దపల్లిరూరల్: దళిత రైతుల కోసం బుల్లక్‌కార్ట్ (ఎడ్లబండి) పథకానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రాతినిథ్యం వహిస్తున్న ధర్మపురి నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. 200 యూనిట్లు కేటాయించి ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. జిల్లాలోని ధర్మారం మండలం ధర్మపురి నియోజకవర్గపరిధిలో ఉండడంతో ఆ మండలానికి 50 యూనిట్లు కేటాయించారు.

రూ.2లక్షలు ఉండాలని ప్రతిపాదించినా

చిన్న, సన్నకారు దళిత రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడేలా కేంద్రం రూపొందించిన పీఎం అజయ్ పథకం కింద పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఎడ్లబండి యూనిట్‌కు రూ.2లక్షలు కేటాయించాలని అధికారవర్గాలు ప్రతిపాదించినట్లు సమాచారం. ఎడ్లబండితో పాటు ఇతర వ్యవసాయ పనిముట్లు అందిస్తే మేలు కలుగుతుందని పేర్కొన్నట్లు తెలిసింది. జతఎడ్లు, బండితో పాటు ఇతర వ్యవసాయ పనిముట్లు కూడా అందిస్తే తమ పనులు పూర్తయ్యాక స్థానికంగా ఉన్న ఇతర రైతులకు అద్దెప్రతిపాదికన పనులు చేసి ఆదాయం గడించొచ్చని సూచించినట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. అయితే ప్రభుత్వం మాత్రం రూ.లక్షతోనే ఎడ్లబండి మాత్రమే ఇచ్చేలా పథకాన్ని సిద్ధం చేసింది.



ఎడ్లబండి

పీఎం అజయ్ పథకం కింద

ప్రధానమంత్రి అనుసూచిత్ జాతీయ అభ్యుదయ యోజన (పీఎం అజయ్) పథకం కింద ఎడ్లబండి యూనిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఎడ్లబండి కావాలనుకునేవారు చిన్న, సన్నకారు దళితరైతులై ఉండాలి. రూ.లక్షతో జతఎడ్లు, బండి అందిస్తారు. ఈ పథకానికి ఎంపికైన దళితరైతుకు పీఎం అజయ్ ద్వారా రూ.50వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేలు, లబ్ధిదారుడు తనవాటా రూ.10వేలు చెల్లించి మిగతా రూ.10వేలను బ్యాంకు నుంచి రుణంగా పొందాల్సి ఉంటుంది.

అర్హులైనవారికి అందిస్తాం



ఎడ్లబండ్ల పథకం కోసం నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి అందిస్తాం. పీఎం అజయ్ పథకం ద్వార పైలట్ ప్రాజెక్టుగా కేటాయించిన యూనిట్లను పొందాలనుకునే దళితరైతులు తమ వాటాగా రూ.10 వేలు చెల్లించి, మరో రూ.10వేలు బ్యాంకు రుణం పొందాల్సి ఉంటుంది.

– మధుసూదనశర్మ, ఎస్సీకార్పొరేషన్ ఈడీ

ఉచితంగా న్యాయసేవలు పొందవచ్చు

- సీనియర్ సివిల్‌జడ్జి అర్జున్

పెద్దపల్లిరూరల్: జిల్లా, మండలస్థాయి లీగల్‌సర్వీసెస్ నుంచి ఉచితంగా న్యాయసేవలు పొందవచ్చని సీనియర్ సివిల్‌జడ్జి కం అసిస్టెంట్ జడ్జి అర్జున్ అన్నారు. పెద్దపల్లిలోని గాయత్రి డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రతీ పౌరుడు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని అన్నారు. న్యాయపరమైన ఇబ్బందులు ఏర్పడితే ఉచితంగా న్యాయసేవలు పొందాలనుకునే వారు లీగల్ సర్వీసెస్ వారికి లిఖితపూర్వకంగా తెలపాలని సూచించారు. యువత సెల్‌ఫోన్ వాడే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆపదలో ఉన్న మహిళలు తమకు సమాచారం అందిస్తే సాయం అందించేందుకు సన్నద్ధంగా ఉన్నామని మహిళా ఎస్సై మౌనిక అన్నారు. న్యాయవాదులు హన్మాన్‌సింగ్, డివిఎస్‌మూర్తి, ప్రిన్సిపాల్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞానసదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి అర్జున్

ఏసీడీ చార్జీలు రద్దు చేయండి

- విద్యుత్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నిరసన



నిరసస తెలుపుతున్న శ్రీధర్‌బాబు, నాయకులు

మంథని: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ అదనపు వినియోగ చార్జీల (ఏసీడీ)పేరుతో ప్రజలపై పెనుభారం మోపుతోందని ఏఐసీసీ కార్యదర్శి, మంథని శాసన సభ్యుడు డి.శ్రీధర్‌బాబు అన్నారు. ఏసీడీ చార్జీల పెంపును నిరసిస్తూ మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి విద్యుత్‌శాఖ డివిజినల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ ధర్నాకు దిగారు. ఏడీఈకి వినతిపత్రం ఇచ్చారు.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఏడీసీ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఇప్పటికే వసూలు చేసిన బిల్లులను వాపస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుకుంటూ పోతే.. రాష్ట్రం విద్యుత్, బస్సు చార్జీలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తోందని ఆరోపించారు. మంథని మున్సిపాలిటీలో పన్నులభారంపై త్వరలో ప్రజలపక్షాన పోరాటం చేస్తామని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యుడు శశిభూషణ్ కాచే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి, కౌన్సిలర్ పెండ్రు రమాదేవి, మూల సరోజన పాల్గొన్నారు.

శారీరక శ్రమతోనే నిరంతర ఆరోగ్యం

- అడ్మిన్ డీసీపీ అఖిల్‌మహాజన్

గోదావరిఖని:శారీరక శ్రమతోనే నిరంతరం ఆరోగ్యంగా జీవించవచ్చని అడ్మిన్ డీసీపీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. శనివారం పోలీసు సిబ్బందికి పరేడ్ నిర్వహించారు. వైద్య నిపుణులతో ఆరోగ్య సూచనలు, సలహాలు, చికిత్సపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డీసీపీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో సంతృప్తి, అసంతృప్తి పనితీరును ప్రభావితం చేస్తుందని, ఈ క్రమంలో పోలీసు సిబ్బంది తీవ్ర ఒత్తిడికి లోనవుతారన్నారు. బీపీ, షుగర్, హార్ట్‌ఎటాక్, తదితర ఆరోగ్య సమస్యల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలన్నారు. ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు , ఆర్‌ఐలు మధుకర్, శ్రీధర్, విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అఖిల్‌మహాజన్

చెక్కు అందజేత

మంచిర్యాల మహిళా పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ కేన్సర్‌తో మృతి చెందిన అవునూరి శ్రీనివాస్ కుటుంబానికి భద్రత చెక్కును అడ్మిన్ డీసీపీ అఖిల్‌మహాజన్ శనివారం అందజేశారు. శ్రీనివాస్ భార్య స్వప్న, వారి పిల్లలకు రూ. 7.92లక్షల విలువగల చెక్కు అందించారు. ఏవో నాగమణి, పోచలింగం, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఎస్సీ ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. 5నుంచి 10వ తరగతి చదివే ఎస్సీ విద్యార్థులంతా తప్పనిసరిగా, త్వరితగతిన దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. బ్యాంకు ఖాతాలు లేని వారిని గుర్తించి ఖాతాలను తెరిపించాలని, మీసేవ కేంద్రాల్లో విద్యార్థుల దరఖాస్తులన్నీ ఒకేసారి ఆన్‌లైన్‌లో పొందుపర్చేలా ఏర్పాటు చేయాలని సూచించారు. దరఖాస్తు గడువు సమీపిస్తున్నందున హాస్టల్ వార్డెన్లు, సంబంధిత అధికారులు ప్రాధాన్యతనిచ్చి దరఖాస్తు చేసుకునేందుకు తమవంతుగా సహకరించాలని తెలిపారు.

క్లుప్తంగా

సింగరేణి క్యాలెండర్ ఆవిష్కరణ



గోదావరిఖని(రామగుండం): సింగరేణి యాజమాన్యం ముద్రించిన నూతన క్యాలెండర్‌ను ఆర్జీ–1 జీఎం కె.నారాయణ శనివారం ఆవిష్కరించారు. జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ రామకృష్ణ, బాలసుబ్రమణ్యం, ప్రభాకర్, శ్రీనివాస్, రాజం, శ్రావణ్‌కుమార్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీసీడబ్ల్యూయూ మహాసభలకు తరలిరండి



యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఈ నెల 29న కొత్తగూడెంలో నిర్వహించే ఎస్‌సీసీడబ్ల్యూయూ రాష్ట్ర 7వ మహాసభలకు కార్మికులందరూ తరలిరావాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ కోరారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో కలిసి మహాసభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి, సింగరేణి శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఈ సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గేశ్, రమేశ్, రాంబాబు, రాజయ్య, శంకరమ్మ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం



సుశీల (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన తంగళ్లపల్లి సుశీల (54) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. భార్య చనిపోయిన బాధలోనూ ఆమె భర్త మధునయ్య సమాజహితం కోసం ఆలోచించారు. సుశీల నేత్రాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి కేఎస్.వాసు ఆధ్వర్యంలో ఐ టెక్నీషియన్ ఆరిఫ్ శనివారం ఆమె నేత్రాలు సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు పంపించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రావణ్‌కుమార్, సీహెచ్.లింగమూర్తి, ప్రతినిధులు భీష్మాచారి, వాసు, రాజమౌళి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రాజేందర్, మల్లికార్జున్, బెణిగోపాల్ త్రివేది ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మృతురాలి బంధువులు కంది నాగరాజు, చంద్రయ్య, పోచయ్య, శ్రీనివాస్, రాజేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులం.. భవితకు సోపానం

- విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో అవకాశం
- అర్హత పరీక్షలో మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు
- ఎంపికైతే ఉచిత విద్యతోపాటు వసతి కల్పన



కరీంనగర్: పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఉచిత విద్యతోపాటు వసతి కల్పించి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న ఈ విద్యాలయాల్లో ప్రవేశానికి ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మైనార్టీ విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో విద్యనభ్యసించేందుకు మైనార్టీ గురుకులాలు వరంగా మారాయి. నిష్ణాతులైన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యాబోధన సాగుతోంది. 2023–24 విద్యాసంవత్సరానికి గాను 5 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 16 విద్యాలయాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో 16 మైనార్టీ గురుకులాలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 5వ తరగతిలో 80 సీట్లు ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో కలిపి 1,280 సీట్లున్నాయి. మిగతా తరగతులకు సీట్ల ఖాళీలను బట్టి ప్రవేశం కల్పిస్తారు. ఈ విద్యాలయాల్లో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతోంది. విశాలమైన తరగతి గదులున్నాయి. విద్యార్థులకు క్రీడలు, యోగాసనాలకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. పదో తరగతి తర్వాత భవిష్యత్తులో ఎంచుకోవాల్సిన కోర్సులపై అవగాహన కల్పిస్తారు.

కరీంనగర్ జిల్లాలో 9 పాఠశాలలు..

కరీంనగర్ జిల్లాలో 9 పాఠశాలలు ఉండగా 5 బాలుర, 4 బాలికలకు చెందినవి. 4 కళాశాలలు కరీంనగర్, జమ్మికుంట, మానకొండూర్, హుజూరాబాద్‌లలో ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 80 చొప్పున 720 సీట్లు భర్తీ చేస్తారు. కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులు, వాటిల్లో 160 సీట్లు ఉన్నాయి.

ముస్లింలకు 51, ఇతరులకు మిగతా సీట్లు..

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి http:///tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో పాఠశాలలో ముస్లింలకు 51, క్రిస్టియన్లకు 5, జైనులు, పార్శీలు, బౌద్ధులు, సిక్కులకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 60 సీట్లు, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, బీసీలకు 10, ఓసీలకు 2 చొప్పున మొత్తం 20 సీట్లు కేటాయించారు. దరఖాస్తుకు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు అవసరమవుతాయి. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి వార్షికాదాయం రూ.2 లక్షలలోపు ఉన్నవారు అర్హులు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతీ విద్యార్థి చదవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. వీటిల్లో ఒక్కో విద్యార్థిపై రూ.లక్షలు వెచ్చిస్తున్నాం. నాణ్యమైన భోజనం అందించడంతోపాటు అర్హత గల అధ్యాపకులతో విద్యనందిస్తున్నాం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం మైనార్టీ గురుకులాల పాఠశాలల్లో ప్రిన్సిపాళ్లను సంప్రదించాలి. 99490 64858, 73311 70844 నంబర్లకు ఫోన్ కూడా చేయవచ్చు.
– పులి మధుసూదన్, మైనార్టీ జిల్లా సంక్షేమ శాఖ అధికారి

రిపబ్లిక్ డేకు ఏర్పాట్లు చేయాలి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్



మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): రిపబ్లిక్ డే ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జనవరి 26న 74వ గణతంత్ర దినోత్సవాన్ని ఏపీజే అబ్దుల్ కలాం స్టేడియంలో నిర్వహించనున్నామని తెలిపారు. జాతీయ జెండావిష్కరణ, సెక్యూరిటీ సిబ్బందిచే గౌరవ వందనం, ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అధికారులు రవీందర్, రాజేంద్రప్రసాద్, ఎర్రన్న, ధనుంజయ, మురళీకృష్ణ, పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో గైర్హాజరు లేకుండా చూసుకోండి

ఎంతో కష్టపడితే గానీ ఉద్యోగం దొరకని ఈ రోజుల్లో ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న సింగరేణిలో సక్రమంగా విధులు నిర్వహించి, ఉద్యోగం కాపాడుకోవాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. వకీల్‌పల్లిగనికి చెందిన ఇద్దరు యువ కార్మికులు విధులకు గైర్హాజరవుతుండగా శనివారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆరోగ్యం, కుటుంబం, వృత్తిపరంగా ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకొని, ముందుకు సాగాలే తప్ప విధులకు రాకపోవడం సరికాదన్నారు. గైర్హాజరు వల్ల ఉద్యోగులతోపాటు సంస్థకు కూడా నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, వకీల్‌పల్లి గని పిట్ సెక్రటరీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బేస్ వర్క్‌షాప్ పనులు పరిశీలన

ఆర్జీ–2 ఏరియాలో నూతనంగా నిర్మిస్తున్న బేస్ వర్క్‌షాప్ పనులను జీఎం ఎ.మనోహర్ శనివారం పరిశీలించారు. షావెల్స్ అండ్ డ్రిల్స్, మ్యాగజిన్ పనులు తనిఖీ చేశారు. కార్మికులకు అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సకాలంలో ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రాజెక్టు అధికారి మోహన్‌రెడ్డి, డీజీఎం సివిల్ ధనుంజయ, ఫారెస్ట్ అధికారి అభిలాష్, సెక్యూరిటీ అధికారి పీవీ రమణ ఉన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సురేశ్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని నందన గార్డెన్‌లో శనివారం రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలను బీజేపీ నాయకుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందన్నారు. దేహదారుఢ్యం పెంచడంతోపాటు మానసికోల్లాసం కలిగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవీందర్, కృష్ణ, సంతోష్, మొండయ్య, సమ్మయ్య, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు కేటాయించండి

- ఆర్డీవోను కోరిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



ఆర్డీవోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మవాడ, కూచిరాజ్‌పల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు అవకాశం కల్పించారని ఫిర్యాదులు వస్తున్నాయని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. వాటిని అర్హులకే కేటాయించాలని కోరుతూ శనివారం ఆర్డీవో వీరబ్రహ్మాచారిని కలిసి, వినతిపత్రం అందించారు. రచ్చపల్లి, అక్కేపల్లి, లద్నాపూర్ ఆర్అండ్ఆర్ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. సింగరేణి భూ నిర్వాసితుల సమస్యలు తీర్చాలని, అర్హులైన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలన్నారు. మంథని మున్సిపల్ పరిధిలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని విన్నవించారు. అంతకుముందు మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 105 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 40 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించారు.

క్షతగాత్రుడి ప్రాణాలు కాపాడిన మేయర్

- బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు • సిద్దిపేట సమీపంలో ఘటన



బాధితుడికి వైద్యం చేస్తున్న మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ(రామగుండం): రోడ్డుపై తీవ్ర గాయాలతో తల్లడిల్లుతున్న ఓ వ్యక్తికి రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్ చికిత్స అందించి, ప్రాణాపాయం తప్పించారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం రాత్రి సిద్దిపేట సమీపంలోని రాజీవ్ ఫోర్‌లేన్ రహదారిపై బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడిని పక్కకు తీసుకెళ్లారు. ఆ సమయంలో అదే దారిన హైదరాబాద్ వెళ్తున్న రామగుండం మేయర్ అనిల్‌కుమార్ తన వాహనాన్ని ఆపారు. ఆయన వైద్యుడే కావడంతో వెంటనే క్షతగాత్రుడి వద్దకు వెళ్లి, ప్రథమ చికిత్స అందించారు. ఈలోపు 108 వాహనం అక్కడికి చేరుకోవడంతో బాధితుడిని అందులో ఎక్కించారు. లోపల ఉన్న వైద్య పరికరాల సహాయంతో ఆసుపత్రికి వెళ్లేవరకు వైద్యం అందించి, ప్రాణాలు కాపాడారు. మేయర్‌ను సిద్దిపేట ప్రజలతోపాటు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అభినందించారు.

భూముల ధరల వల్లే ఆస్తి పన్ను పెంపు

- మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్



సుల్తానాబాద్(పెద్దపల్లి): భూముల ధరలు పెరగడం వల్లే ఆస్తి పన్ను పెరిగినట్లు మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ తెలిపారు. శనివారం ఆయ సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. ఆస్తి పన్ను అధికంగా వసూలు చేస్తున్నారని, వెంటనే తగ్గించాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వినతిపత్రం అందజేయడంతో విచారణకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఆస్తి విలువ పెరగడంతో దాని ప్రకారం పన్ను విధిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, ప్రజాప్రతినిధుల అభిప్రాయం తీసుకొని, ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని రీజినల్ డైరెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు రేట్ అఫ్ ప్రాపర్టీ ట్యాక్స్ 0.60 శాతం ఉందని, మున్సిపాలిటీగా మారాక రేటు పెంచలేదని, భూమి విలువ పెరగడం వల్ల ఆస్తి పన్ను పెరిగినట్లు గుర్తించానని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మిషన్ భగీరథ నీరు బంద్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఆదివారం నుంచి మిషన్‌భగీరథ నీటి సరఫరాను మూడు రోజుల పాటు నిలిపివేస్తున్నామని మిషన్‌భగీరథ గ్రిడ్ ఈఈ పూర్ణచందర్ తెలిపారు. మూర్మూర్ వద్ద ఉన్న 160ఎంఎల్‌డీ నీటిశుద్ధి కేంద్రం వద్ద నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నెల 24వరకు నీటిసరఫరా నిలిపివేస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా మిషన్‌భగీరథ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

బడి బయటి పిల్లలపై.. సర్వే 25 వరకు పొడిగింపు

- సంక్రాంతి సెలవుల నేపథ్యంలో సర్కారు నిర్ణయం
- ఇప్పటివరకు జిల్లాలో 115 మంది గుర్తింపు
- పాఠశాలల్లో చేర్పించిన అధికారులు



గుర్తించిన పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న అధికారులు

సుల్తానాబాద్: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు సమగ్ర శిక్ష అభియాన్, రాష్ట్ర విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం బడి బయటి పిల్లల గుర్తింపునకు సర్వే చేయాలని ఆదేశించింది. ఈ నెల 6 నుంచి 18 వరకు చేపట్టాలని సూచించింది. కానీ మధ్యలో సంక్రాంతి సెలవులు రావడంతో ఈ నెల 25 వరకు పొడిగించింది.

మూడు కేటగిరీల్లో వివరాలు..

బడి బయటి పిల్లల సమాచారం పక్కాగా సేకరించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటి సర్వే చేయాలని, ప్రతి ఒక్కరినీ బడిలో చేర్పించాలని సూచించారు. స్కూళ్ల పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతోపాటు, క్లస్టర్, విలీన విద్య రిసోర్స్‌పర్సన్లకు సర్వే బాధ్యతలు అప్పగించారు. మూడు కేటగిరీల్లో 6–14, 15–19 ఏళ్లలోపు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల వివరాలు నమోదు చేయాలి. ఈ నెల 30లోపు జిల్లా విద్యాశాఖకు అందించాల్సి ఉంటుంది. సంబంధిత పూర్తి సమాచారాన్ని 31న డీఈవో సమక్షంలో రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించనున్నామని విద్యాశాఖ సంబంధించిన ఓ అధికారి తెలిపారు.

గతేడాది 150 మంది..

గతేడాది 6–19 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలను 150 మందిని గుర్తించారు. వీరిలో జిల్లాకు చెందినవారు 70 మంది, వలస కార్మికుల పిల్లలు 80 మంది. అందరినీ పాఠశాలల్లో చేర్పించగా వలస కార్మికుల పిల్లలు తమ తల్లిదండ్రులతో కలిసి స్వస్థలాలకు వెళ్లిపోయారు.

ఇటుక బట్టీల్లో మారని పరిస్థితి..

పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ధర్మారం, రామగిరి, రాఘవాపూర్, రాగినేడు, సుల్తానాబాద్, ఎలిగేడు, ఓదెల, పెద్దపల్లి, గోదావరిఖనితోపాటు పలు ప్రాంతాల్లో ఇటుక బట్టీల వ్యాపారం కొనసాగుతోంది. ఏటా డిసెంబర్‌లో ఒడిశా, బిహార్ రాష్ట్రాల నుంచి వలస కార్మికులు ఇక్కడి వచ్చి, ఇటుకల తయారీతో ఉపాధి పొందుతున్నారు. వారు తమ పిల్లలను కూడా పనులకు తీసుకెళ్తారు. వర్షాకాలం ప్రారంభం కాగానే తిరిగి స్వగ్రామాలకు వెళ్తారు. పిల్లందరూ బడీడువారే కావడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటుక బట్టీల్లో ప్రత్యేక పాఠశాలలు తూతూమంత్రంగా సాగుతున్నాయన్న విమర్శలున్నాయి.

'ఓపెన్' పరీక్షలు రాసేలా ఏర్పాట్లు..

రెండో దశలో గుర్తించిన వారిని ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పిల్లలను గుర్తించి, వారితో పరీక్షలు రాయించినట్లు తెలిపారు.

కార్మికుల పిల్లలే ఎక్కువ..



జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 115 మందిని బడీడు పిల్లలను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించాం. వీరిలో ఎక్కువగా ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికుల పిల్లలే ఉన్నారు. సమగ్ర శిక్ష, రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు పక్కాగా సర్వే చేయాలని అధికారులకు సూచించాం. ఈ నెల 25 వరకు గ్రామ గ్రామాన పకడ్బందీగా కొనసాగుతుంది. ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలి.
– పీఎం షేక్, జిల్లా విద్య క్వాలిటీ కో–ఆర్డినేటర్

యువతి ఆత్మహత్య



శ్వేత మృతదేహం

ముత్తారం(మంథని): మండలంలోని ఓడేడ్ గ్రామానికి చెందిన కట్ల శ్వేత(21) ఆత్మహత్య చేసుకుందని ఎస్సై బేతి రాములు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్వేత తల్లిదండ్రులు శనివారం పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఆమె ఇంటి దూలానికి ఉరేసుకుంది. తల్లి మందలించడంతోనే ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి రమణాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దూసుకొచ్చిన లారీ.. ఇల్లు ధ్వంసం



ముత్తారం(మంథని): మండలంలోని ఖమ్మంపల్లిలో లారీ ఒక్కసారిగా దూసుకురావడంతో ఓ ఇల్లు ధ్వంసమైంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఖమ్మంపల్లి శివారులోని మానేరును ఆనుకొని ఉన్న పంట పొలాల్లో వరదకు ఇసుక మేటలు వేసింది. దాన్ని శనివారం లారీల్లో ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఓ లారీ అతివేగంగా కొత్తకొండ రాజక్క ఇంటిపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఆ ఇల్లు ధ్వంసమైంది. సమయానికి లోపల ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సంఘటన స్థలాన్ని ఎస్సై బేతి రాములు పరిశీలించారు.

వేతన ఒప్పందంలో బీఎంఎస్‌ది క్రియాశీల పాత్ర

- అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

రామగిరి(మంథని): బొగ్గు గని కార్మికుల జేబీసీసీఐ 11వ వేతన ఒప్పందంలో 19 శాతం సాధించడంలో బీఎంఎస్ క్రియాశీల పాత్ర పోషించిందని సంఘం అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఆర్జీ–3 ఓసీపీ–1లో శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 11వ వేతన ఒప్పందం సాధించడం కార్మికుల విజయమని అన్నారు. మెరుగైన ఒప్పందం చేయాలన్న డిమాండ్‌తో సింగరేణి వ్యాప్తంగా మరో మూడు సంఘాలను కలుపుకొని ధర్నాలు చేపట్టామని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగి, ఆర్థిక మాంద్యం ఏర్పడుతోందన్నారు. సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన రూ.25 వేల కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కేంద్ర ఉపాధ్యక్షులు, నాయకులు సారంగపాణి, మాదాసి రవీందర్, వేణుగోపాల్‌రావు, గాలిపెల్లి తిరుపతి, మామిడి స్వామి, రాజమహేందర్ రెడ్డి, తోట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సీపీఎం పోరు యాత్ర



యాత్రను ప్రారంభిస్తున్న మల్లారెడ్డి

రామగుండం: కార్పొరేషన్ పరిధిలోని నిరుపేదలకు నివేశన స్థలాలతోపాటు స్థానిక సమస్యల పరిష్కారానికి సీపీఎం నాయకులు శనివారం పోరుయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సోవియట్ యూనియన్ వ్యవస్థాపకుడు వ్లాదిమిర్ లెనిన్ వర్ధంతిని పురస్కరించుకొని, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో సమస్యలు పేరుకుపోయాయని ఆరోపించారు. తమ యాత్ర విప్లవ చైతన్యంతో కూడిందని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాలు, కనీస వేతనాల జీవో విడుదల తదితర హామీలు ఇచ్చిన టీఆర్ఎస్ వాటిని మరిచిందన్నారు. ఇప్పుడు దేశ సమస్యలను పరిష్కరిస్తామని బీఆర్ఎస్ పార్టీగా అవతరించడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు బొజ్జా భిక్షమయ్య, వై.యాకయ్య, వేల్పుల కుమారస్వామి, అనుముల మహేశ్వరి, లావణ్య, శంకర్, లక్ష్మారెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.